

సాగరతీరంలో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం బీచ్ ఆదివారం పర్యాటకులతో కలకలలాడింది. పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు ప్రత్యేక ద్విచక్ర వాహనాలలో బీచ్‌కు ఉదయమే చేరుకున్నారు. పలువురు సముద్ర కెరటాలలో స్నానాలు చేశారు. చిన్నారులు ఒడ్డుకు కొట్టుకు వస్తున్న కెరటాలతో ఇసుక తిన్నెలపై ఆటలాడుకున్నారు. వడ్డున ఉన్న ఆలయాలను దర్శించుకుని సర్వే తోటలలో సహపంతి భోజనాలు చేసి సేద తీరారు.



సందడి చేస్తున్న పర్యాటకులు

సమస్యల నిలయాలు.. కాలనీలు

జిల్లాలో నిరుపేదల పరిస్థితి దారుణం
కనీస మౌలిక వసతుల కల్పనలో పాలకుల నిర్లక్ష్యం
ఇళ్లు, ఇళ్ల స్థలాలు, ఇళ్ల పట్టాల కోసం పడిగాపులు
ఏళ్లు గడుస్తున్నా పూర్తిస్థాయిలో పంపిణీకి నోచని టిడ్కో గృహాలు
రోడ్లు, డ్రెయినేజీలు సౌకర్యాల్లేక ఇబ్బందులు
సిపిఎం ప్రజా చైతన్య సైకిల్ యాత్ర బృందం వద్ద బాధితుల ఆవేదన
నేడు జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా
హాజరుకానున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు



ప్రజల నుంచి సమస్యలు వింటున్న సైకిల్ యాత్ర బృందం

ప్రజాశక్తి - భీమవరం

మానవుడు జీవించాలంటే కూడు, గుడ్డ, నీరు కనీస అవసరాలుగా ఉన్నాయి. అయితే ఇవి నేటికీ అందని ద్రాక్షగానే ఉన్నాయి. ప్రభుత్వాలు మారుతున్నా, ప్రజా ప్రతినిధులు ఏలుతున్నా మనిషి జీవన స్థితిగతులు మాత్రం మారడం లేదు. ఫలితంగా పాలకుల నిర్లక్ష్యానికి ఎన్నో నిరుపేద కుటుంబాలు సమస్యలే వారి ఆవాసాలుగా జీవనం సాగిస్తున్నారు. ఎవరికి చెప్పినా.. ఎన్నిసార్లు తిరిగినా.. పట్టించుకునే నాథుడే లేకపోవడంతో బరువెక్కిన గుండెతో కాలం గడుపుతున్న నిరుపేదలకు సిపిఎం ప్రజా చైతన్య సైకిల్ యాత్ర భరోసా నింపింది. ఈ నేపథ్యంలో నిరుపేదలు సైకిల్ యాత్ర బృందానికి సమస్యలు ఏకరువు పెట్టి కన్నీరు మున్నీరుగా విలపించారు. అధైర్య పడొద్దు అండగా ఉంటామంటూ ప్రజా చైతన్య సైకిల్ యాత్ర బృందం మనోధైర్యాన్ని నింపింది. సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకూ అండగా ఉంటామంటూ భరోసానిచ్చింది.

జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇళ్లు, ఇళ్ల స్థలాలు, టిడ్కో ఇళ్లు, ఇళ్ల పట్టాల సమస్యలపై ఈ నెల 8 నుంచి 16వ తేదీ వరకూ సిపిఎం జిల్లా వ్యాప్తంగా ప్రజా చైతన్య సైకిల్ యాత్ర చేపట్టింది. పది రోజులపాటు సాగిన ఈ యాత్ర 20 మండలాలు, 6 పట్టణాలు సుమారు 80 గ్రామాల్లో 130 కిలోమీటర్లకు పైగా సాగింది. సైకిల్ యాత్ర దళ నాయకులు సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ సారథ్యంలో మరో 15 మంది నాయకులు బృందంగా ఏర్పడి జిల్లా నలుమూలలు తిరిగి సమస్యలపై అధ్యయనం చేశారు. అడుగడుగునా పేదలు బృందం వద్ద సమస్యలు ఏకరువు పెట్టారు. జిల్లాలో భీమవరం, పాలకొల్లు, తాడేపల్లిగూడెం, తణుకులో 20,784 టిడ్కో గృహాలు నిర్మించి ఏళ్లు గడుస్తున్నా కేవలం 8 వేల మందికి మాత్రమే వీటిని అప్పగించారు. అయితే ఇక్కడ నివాసముంటున్న వారు తాము సమస్యలతో సహవాసం చేస్తున్నమంటూ బృందం వద్ద వాపోయారు. తాగునీరు, డ్రెయినేజీ, మరుగుదొడ్లు, స్లాబ్ లీకేజీ, రోడ్లు, పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు లేక ఇబ్బందులు పడడమే కాకుండా కనీసం బియ్యం అందించే వాహనాలు కూడా రావట్లేదంటూ కంటతడి పెట్టారు. మరి కొంతమంది తమకు గృహాలు కేటాయించకుండానే బ్యాంకు అధికారులు రుణాలు కట్టాలంటూ ఒత్తిడి తీసుకొస్తున్నారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులు రూ.500 కోట్లకుపైగా అప్పుల పాలయ్యారని సైకిల్ యాత్ర పర్యనల్‌లో తేలిందంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. సుమారు ఎనిమిదేళ్ల క్రితం నిర్మించుకున్న గృహాలకు బకాయిలు సైతం చెల్లించిన పాపాన పోలేదని ఆందోళన చెందారు. ఎన్నో ఏళ్ల నుంచి ప్రభుత్వ భూముల్లో తినీ తినక ఇల్లు నిర్మించుకుని జీవనం సాగిస్తుంటే కాలుష్యం, అభివృద్ధి పేరుతో అన్యాయంగా ఇళ్లను తొలగిస్తున్నారంటూ పాలకోడేరు, ఆకివీడు, కాళ్ల, ఉండి మండలాల నిరుపేదలు బృందం వద్ద వాపోయారు. వారి సమస్యలను బృందం సభ్యులు వింటూనే సమస్యలపై వ్యక్తిగత దరఖాస్తులు స్వీకరించారు. ప్రధానంగా రేషన్‌కార్డులు, డ్రెయినేజీ, తాగునీరు, రోడ్లు, పెన్షన్లు, శ్మశానవాటిక వంటి సమస్యలను తీసుకొచ్చారు. సిపిఎం జిల్లా కార్యదర్శి గోపాలన్ నిరుపేదల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. జిల్లా పంచాయతీ అధికారి అరుణశ్రీ, నరసాపురం ఆర్‌డిఒ దాసిరాజు, యలమంచిలి తహశీల్దార్, చించినాడ గ్రామ కార్యదర్శులతో ఫోన్ ద్వారా సమస్యలు పరిష్కరించాలని కోరారు. అయితే జిల్లా వ్యాప్తంగా చేపట్టిన సైకిల్ యాత్ర ద్వారా వచ్చిన సమస్యల పరిష్కారానికి సిపిఎం ఈ నెల 17న భీమవరం కలెక్టరేట్ వద్ద భారీ ధర్నా చేపట్టింది. లబ్ధిదారులు నిరుపేదల సమస్యలపై వ్యక్తిగత వినతులు, విజ్ఞాపనలను కలెక్టర్ చదలవాడ నాగరాణికి అందించేందుకు సిద్ధమయ్యారు. ఈ ధర్నాకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి.బలరాం హాజరు కానున్నారు. జిల్లా నలుమూల నుంచి వేలాది మంది ధర్నాకు తరలివచ్చి విజయవంతం చేయాలని సిపిఎం పిలుపునిచ్చింది.

మనుషులుగా గుర్తించడం లేదు.. ★★★

కోనేటి మరియమ్మ, జయంతి కాలనీ, తణుకు



నాకు భర్త లేడు. ఇద్దరు పిల్లలు ఉన్నారు. మా నాన్నకు కళ్లు లేవు. వీళ్లని చూసుకుంటూ ఇళ్లల్లో పాచి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాను. ఉండటానికి కనీసం ఇల్లు లేదు. ఎంతోమందికి సమస్యను చెప్పినా పట్టించుకోలేదు. చచ్చేలోపు అయినా మా బతుకులు మారతాయో లేదో అని భయమేస్తోంది. కనీసం మమ్మల్ని మనుషులుగా కూడా గుర్తించట్లేదు.

పట్టా ఇచ్చారు.. స్థలం కేటాయించలేదు ★★★

ఆకుల రమణ , ఇరగవరం



మాకు 2012లో ఇంటి పట్టా ఇచ్చారు. ఇంతవరకూ స్థలం కేటాయించలేదు. అద్దె ఇంట్లో ఉంటున్నాం. అధికారులు కనీసం పట్టించుకోవడం లేదు. దయచేసి మాకు కేటాయించిన స్థలాన్ని చూపిస్తే మేము ఇల్లు కట్టుకుంటాం. పిల్లలతో అనేక ఇబ్బందులు పడుతున్నాం. మా గోడు పట్టించుకుని సమస్య పరిష్కరించాలి.

సమస్యలు పట్టించుకోవడం లేదు.. ★★★

గ్రంధి సోమ అయ్యప్ప, వడలి



2019లో 123 మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చారు. ఇక్కడ నాతో పాటు 40 మందికిపైగా ఇల్లు నిర్మించుకుని జీవనం సాగిస్తున్నాం. ఏళ్లు గడుస్తున్నా కనీసం సౌకర్యాలు కల్పించలేదు. రోడ్డు లేకపోవడంతో ఎన్నో ఇబ్బందులు పడ్డాం. ఎవరూ పట్టించుకోకపోవడంతో తలో రూ.4 వేలు వేసుకొని రోడ్డుపై ఇసుక వేసుకున్నాం. డ్రెయినేజీ లేక వర్షం వస్తే మోకాళ్లలోతు నుంచి నడిచి వెళ్లాల్సి వస్తుంది. తాగునీరు రాకపోవడంతో దూర ప్రాంతం వెళ్లి తాగాల్సి వస్తుంది.

పెన్షన్ కోసం ముప్పు తిప్పలు పెడుతున్నారు ★★★

జనిపల్లి నాగమణి, సిద్ధాంతం



గతేడాది నా భర్త ప్రమాదంలో మృతి చెందాడు. ముగ్గురి కుమార్తెలకు పెళ్లిళ్లు చేసి ఒంటరిగా జీవిస్తున్నాను. గతంలో నా భర్తకు పింఛను వచ్చేది. ఆయన చనిపోయిన తర్వాత ఆ ఫించను నాకు ఇవ్వమని అడిగిన ఇవ్వట్లేదు. అధికారుల చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా ఉపయోగం లేకుండా పోయింది. ఎవరికి చెప్పినా పట్టించుకోవడం లేదు. నాకు పింఛను ఇప్పించాలని కోరుతున్నాను.

పాలకుల నిర్లక్ష్యం నిరుపేదలకు శాపం ★★★

జెఎన్‌వి.గోపాలన్, సిపిఎం జిల్లా కార్యదర్శి, భీమవరం



పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా చైతన్య సైకిల్ యాత్రలో జిల్లా ప్రజల సమస్యలపై ఏకరువు పెట్టారు. వారి ఇబ్బందులు వర్ణనాతీతం. ఎన్నో ఏళ్ల నుంచి సమస్యలతో సహవాసం చేస్తున్నారు. ప్రభుత్వాలు మారిపోతున్నా, ప్రజా ప్రతినిధులు వస్తున్నా వారి సమస్యలు మాత్రం పరిష్కారానికి నోచుకోవడం లేదు. ఇది అత్యంత దారుణం. స్వతంత్ర దేశంలో బతుకుతున్నామా లేక బ్రిటీష్ కాలంలో ఉన్నామా అనేది అనుమానంగా ఉంది. దీనంతటికీ కారణం పాలకుల నిర్లక్ష్యమే నిరుపేదలకు శాపంగా మారింది. ప్రజల ఓట్లతో గెలిచి వారి సమస్యలను పెడచెవిన పెట్టి వ్యక్తిగత ఆర్థిక స్వలాభం కోసం పాకులాడడం ఎంతవరకూ సమంజసం. సైకిల్ యాత్ర దృష్టికి వచ్చిన ప్రతి సమస్యనూ ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్తాం. సమస్యలపై ప్రభుత్వం నుంచి సరైన స్పందన రాకపోతే భవిష్యత్ కార్యాచరణ ప్రకటించి పోరుబాటకు సిద్ధమవుతాం.

పది పరీక్షలకు సర్వం సిద్ధం

నేటి నుంచి పరీక్షలు ప్రారంభం
పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి
పరీక్షలు రాయనున్న 24,398 మంది విద్యార్థులు
128 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు
పరీక్షల విధుల్లో సుమారు 1600 మంది అధికారులు
పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు
డిఇఒ ఇవివిఎన్‌ఎస్ఎస్‌బిఎల్. నారాయణ



ప్రజాశక్తి - భీమవరం



జిల్లా వ్యాప్తంగా నేటి నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకూ నిర్వహించబోయే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఇవివిఎన్ఎస్ఎస్‌బిఎల్.నారాయణ తెలిపారు. జిల్లాలో 128 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని, సుమారు 24,398 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించడం జరిగిందన్నారు. నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి అనుమతించేది లేదని స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 1600 మంది అధికారులు పరీక్షల విధులు నిర్వహించనున్నారని తెలిపారు. పది పరీక్షల నిర్వహణకు సంబంధించి ప్రజాశక్తి నిర్వహించిన ముఖాముఖిలో డిఇఒ నారాయణ వివరాలు వెల్లడించారు.

ప్రశ్న : ఎంతమంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు?

డిఇఒ : జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది 24,393 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. దీనిలో బాలురు 11,919 మంది, బాలికలు 10,847 మంది ఉన్నారు. కంపార్ట్మెంట్లో మరో 2,228 మంది, ఓపెన్ విద్యార్థులు మరో 500 మంది పరీక్షలు రాయనున్నారు.

ప్రశ్న : ఎన్ని పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు?

డిఇఒ : జిల్లాలో 128 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశాం. అలాగే ఓపెన్ కేటగిరిలో పరీక్షలు రాసే విద్యార్థులకు 7 కేంద్రాలను ఏర్పాటు చేశాం.

ప్రశ్న : పరీక్షల విధులకు ఎంతమంది అధికారులను నియమించారు?

డిఇఒ : చీఫ్ సూపరింటెండెంట్లు 128 మంది, డిపార్ట్మెంట్ అధికారులు 128 మంది, రూట్ అధికారులు 23 మంది, ఏడు సెట్టింగ్ స్క్వాడ్లు, ఇన్విజిలేటర్లో కలిపి మొత్తంగా 1,600 మంది అధికారులను పరీక్షల విధులకు నియమించాం.

ప్రశ్న : పరీక్షలు ఎప్పటి వరకూ కొనసాగుతాయి?

డిఇఒ : ఈ నెల 17 నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నెల 31వ తేదీ వరకూ కొనసాగనున్నాయి. ఒక వేళ 31వ తేదీన రంజాన్ పండగ వస్తే ఏప్రిల్ 1వ తేదీ వరకూ జరుగుతాయి. ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:45 వరకూ జరుగుతాయి. గంట ముందుగా విద్యార్థులు పరీక్షా కేంద్రానికి హాజరు కావాలి. నిమిషం ఆలస్యమైనా అనుమతించే ప్రసక్తి ఉండదు. ఈ విషయాన్ని విద్యార్థులు గమనించాలి.

ప్రశ్న : పరీక్షా కేంద్రాలో ఎటువంటి సౌకర్యాలు కల్పించారు.

డిఇఒ : పరీక్షా కేంద్రాల్లో అన్ని సౌకర్యాలూ కల్పించాం. కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించాం. కేంద్రానికి 100 మీటర్ల దూరంలో ఎటువంటి జిరాక్స్ షాపులు లేకుండా చర్యలు చేపట్టాం. పరీక్షా కేంద్రంలోకి ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించం. అలాగే పరీక్షా కేంద్రం వద్ద తాగునీరు, మరుగుదొడ్లు, మెడికల్ క్యాంపు, ఒఆర్ఎస్ ప్యాకెట్లు ఏర్పాటు చేశాం. నిరంతరం విద్యుత్తు అందుబాటులో ఉంచే విధంగా ముందస్తు చర్యలు చేపట్టాం. ముఖ్యంగా విద్యార్థులు హాల్ టికెట్ చూపిస్తే ఉచిత ఆర్‌టిసి బస్సు ప్రయాణం కల్పించే విధంగా చర్యలు తీసుకున్నాం.

ప్రశ్న : సమస్యాత్మక పరీక్షా కేంద్రాలు ఉన్నాయా?

డిఇఒ : తాడేపల్లిగూడెం, పెంటపాడు, పెనుగొండ, ఆచంట, పాలకోడేరు, నరసాపురం మండలాల్లోని ఆరు సంవత్సరాల పరీక్షా కేంద్రాలను గుర్తించాం. ఈ కేంద్రాల్లో సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు జరుగుతాయి. కావాలని సమస్యలు సృష్టిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి వెనకాడం.

ప్రశ్న : విద్యార్థులకు మీరిచ్చే సూచనలు ఏంటి?

డిఇఒ : ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాసే విధంగా అన్ని ఏర్పాట్లూ పకడ్బందీగా చేశాం. విద్యార్థులు ఆందోళనకు గురికాకుండా పరీక్షలు రాయాలి. సమయపాలన పాటించి పరీక్షలు రాయాలి. తల్లిదండ్రులు విద్యార్థులను ప్రోత్సహించాలి. ముందుగానే పరీక్షా కేంద్రాలకు రావాలి. అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలంటే సమయస్ఫూర్తి ఎంతో కావాలి. దీనికి అనుకూలంగా విద్యార్థులు నడుచుకోవాలి.

కేశవరం బెయిలీ వంతెన పునఃప్రారంభం

ప్రజాశక్తి - గణపవరం

దాతల సహకారంతో పున నిర్మించిన కేశవరం బెయిలీ వంతెనను ఆదివారం ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు పున ప్రారంభించారు. వంతెన శిథిలావస్థకి చేరి ప్రజలకు ప్రమాదాలు జరుగుతున్న సందర్భాలలో సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ప్రజలు అనేక ఆందోళనలు చేపట్టారు. వాటి ఫలితంగా ఎంఎల్ఎ ధర్మరాజు కృషిమేరకు వంతెన నిర్మాణం చేయడానికి కావలసిన నిధులను దండు సత్యనారాయణ రాజు(బోస్ రాజు యుఎస్ఎ) సమకూర్చటంతో వంతెన నిర్మాణం పూర్తి చేశారు. ఈ సందర్భంగా ధర్మరాజు మాట్లాడుతూ దాతలు ముందుకు వస్తే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. బోస్‌రాజు రూ.10 లక్షలతో వంతెన పనులు పూర్తిచేసి వంతెన ప్రజలకు అందుబాటులోకి తీసుకు వచ్చినట్లు తెలిపారు. దాత బోస్‌రాజు మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి మరింత ఆర్థిక సహకారాన్ని అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేశవరం గ్రామ సర్పంచి మిడతాని కామేశ్వరి నాగేశ్వరరావు, ఎంపిడిఒ ఆర్.బేబి శ్రీలక్ష్మీ, మండలంలోని అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు త్యాగం మరవలేనిది : మంత్రి

పాలకొల్లు : పొట్టి శ్రీరాములు ఆశయాలకు అనుగుణంగా ముఖ్యమంత్రి రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతున్నారని మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. పాలకొల్లు గాంధీ బొమ్మల సెంటర్లో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి మంత్రి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని నిలిపేందుకు ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రాణ త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు అని ఈ సందర్భంగా మంత్రి చెప్పారు. పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయం, సత్యం, అహింస, హరిజనోద్ధరణకు జీవితాంతం కృషిచేశారని చెప్పారు. అమరజీవి ఆశయ సాధన కోసం పునరంకితమవుదాం అన్నారు.

భీమవరం టౌన్ : రక్తదానం ప్రాణదానంతో సమానమని, ఉచిత రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమని జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో త్యాగరాజ భవనంలో ఉచిత రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. జెసి రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రక్తదానం చేసి రక్తదాతలు కావాలని, ప్రమాదాల్లో గాయపడిన వారికి, అత్యవసర వైద్యసేవలు పొందే వారికి రక్తం ఎంతో అవసరమని, దీన్ని అందరూ గుర్తించి స్వచ్ఛందంగా ముందుకు రావాలని సూచించారు. యువజన సంఘం అధ్యక్షుడు జూలూరి వెంకటేష్ మాట్లాడుతూ 58 రోజులపాటు ఆమరణ నిరహార దీక్షలు చేసి ప్రాణ త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు అని, ఆయన 125వ జయంతి సందర్భంగా ఉచిత రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశామని, 70 మంది రక్తదానం చేశారని అన్నారు. అనంతరం 74 సార్లు రక్తదానం చేసిన సమయమంతుల నానిని జెసి, సంఘ సభ్యులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో వబిలిశెట్టి వెంకటేశ్వరావు, తటవర్తి బదిరీ నారాయణ, వబిలిశెట్టి కిషోర్, పెరుమళ్ల శివ, బోండా నిషాంత్, కారుమూరి నితీష్, పులవర్తి కాశీ పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ వైద్యసేవలో.. నిరసన గళం..!

17 ఏళ్లుగా ఫీల్డ్ సిబ్బంది సమస్యలకు పరిష్కారం కరువు
కూటమి ప్రభుత్వంలోనూ మార్పు శూన్యం
నేడు, 24వ తేదీన జిల్లా సమన్వయకర్తల కార్యాలయాల వద్ద నిరసనలు
రెండు జిల్లాల్లో 124 మంది వరకూ వైద్యమిత్రలు, ఇతర సిబ్బంది
అరకొర జీతంతో అవస్థలు.. క్యాడర్ కేటాయింపు నిల్
ప్రభుత్వ కాంట్రాక్ట్ ఉద్యోగులుగా గుర్తింపు, కేడర్ అమలుకు డిమాండ్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి



ఎన్‌టిఆర్ వైద్య సేవ ట్రస్ట్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు పోరుబాట పట్టారు. 17 ఏళ్లుగా కొనసాగుతున్న సమస్యలను పరిష్కరించి తమకు న్యాయం చేయాలని సోమవారం, 24వ తేదీన రెండు రోజుల పాటు శాంతియుత నిరసనలకు దిగుతున్నారు. జిల్లా సమన్వయకర్తల కార్యాలయాల వద్ద నిరసనలు కొనసాగించి వినతిపత్రాలు ఇవ్వనున్నారు. గతంలో ఆరోగ్యశ్రీ, ప్రస్తుతం ఎన్‌టిఆర్ వైద్యసేవ ట్రస్ట్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల పరిస్థితి అత్యంత దారుణంగా మారింది. ఎన్‌టిఆర్ వైద్యసేవలో ఉద్యోగులుగా వైద్య మిత్రలు, టీం లీడర్లు, జిల్లా మేనేజర్లు, ఆఫీస్ అసోసియేట్లు, సిసి మానటరింగ్ డిఇఒలు పనిచేస్తున్నారు. ఏలూరు జిల్లాలో 69 మంది, పశ్చిమలో 55 మంది పనిచేస్తుండగా రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది పనిచేస్తున్న పరిస్థితి ఉంది. ప్రస్తుత పరిస్థితులో ఎన్‌టిఆర్ వైద్యసేవలో అందిస్తున్న వైద్యసేవలు ప్రజలకు అత్యంత కీలకంగా మారాయి. వైద్యం ఖర్చులు విపరీతంగా పెరిగిపోవడంతో డయాలసిస్, గుండె, ఎముకలకు సంబంధించిన అనేక ఆపరేషన్లు, కేన్సర్‌తోపాటు అనేక రోగాలకు వైద్యసేవా ట్రస్ట్ ద్వారానే వైద్యసేవలు జనం పొందుతున్న పరిస్థితి కొనసాగుతోంది. గత ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పేరుతో ఈ పథకం కొనసాగించింది. ఎన్‌టిఆర్ వైద్యసేవా ట్రస్ట్ కింద ఏలూరు జిల్లాలో 107 ఆసుపత్రుల్లో వైద్యసేవలు అందుతుండగా, వీటిలో 31 ప్రయివేటు నెట్‌వర్క్ ఆసుపత్రులు ఉన్నాయి. పశ్చిమలో 73 ఆసుపత్రుల్లో ఎన్‌టిఆర్ వైద్యసేవలు అందుతుండగా 23 వరకూ ప్రయివేటు ఆసుపత్రులు ఉన్నాయి. ఎన్‌టిఆర్ వైద్యసేవ సక్రమంగా అమలు చేయడంలో అందులో పనిచేస్తున్న ఉద్యోగులదే కీలక పాత్ర. అలాంటి ఉద్యోగుల పరిస్థితి మాత్రం అత్యంత ఘోరంగా ఉందని చెప్పొచ్చు. ఎన్‌టిఆర్ వైద్యసేవలో చాలామంది 17 ఏళ్లుగా పనిచేస్తున్నారు. ఉద్యోగులకు ఇచ్చే జీతం మాత్రం రూ.15 వేలు కాగా, కటింగ్‌లు పోను చేతికొచ్చే జీతం రూ.13,080 మాత్రమే. ప్రస్తుతం కూరగాయల నుంచి నిత్యావసర ధరల వరకూ ఆకాశాన్ని తాకుతున్నాయి. స్కూల్ ఫీజులు వంటివి అందనంత ఎత్తులో ఉన్నాయి. అయినప్పటికీ ఎన్‌టిఆర్ వైద్యసేవ ఉద్యోగుల జీతాలు మాత్రం పెరగడం లేదు. దీంతో ఆ శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులను కలిసి విన్నవించుకున్నా సమస్యలకు పరిష్కారం దొరకని పరిస్థితి నెలకొంది. దీంతో తమ సమస్యల పరిష్కారం కోసం ఎన్‌టిఆర్ వైద్యసేవా ఉద్యోగులు నిరసన గళం విప్పారు.

కనీస డిమాండ్లు సైతం పరిష్కరించలేరా?

ఎన్‌టిఆర్ వైద్యసేవలో పనిచేస్తున్న ఉద్యోగులు గొంతెమ్మ కోర్కెలు ఏమీ కోరడం లేదు. 17 ఏళ్లుగా పనిచేస్తున్న తమను ప్రభుత్వ కాంట్రాక్ట్ ఉద్యోగులుగా గుర్తించి జిఒ ఏడు ప్రకారం కేటగిరి-1 డిపిఒ (డిజిటల్ ప్రొసెసింగ్ ఆఫీసర్) క్యాడర్ అమలు చేయాలని కోరుతున్నారు. ఉద్యోగులు ఎవరైనా చనిపోతే వారి కుటుంబాలకు రూ.15 లక్షలు ఎక్స్‌గ్రేషియా, పదవీ విరమణ బెనిఫిట్స్‌గా రూ.పది లక్షలు ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగాల్లో వెయిటేజ్ కల్పించాలని కోరుతున్నారు. కనీస వేతనాలు అమలు చేయాలని, ఉద్యోగులకు అంతర్గత ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. ఎన్‌టిఆర్ వైద్యసేవలో పనిచేస్తున్న ఉద్యోగులు అడుగుతున్న డిమాండ్లు చాలా సాధారణమైనవని చెప్పొచ్చు. ఉద్యోగ భద్రత కల్పించాలని కోరడం ఏవిధంగా తప్పు అవుతుందో ప్రభుత్వం చెప్పాల్సి ఉంది. ఎన్‌టిఆర్ వైద్యసేవలో వైద్యం పొందే రోగులు చేరినప్పటి నుంచి డిశ్చార్జ్ వరకూ అన్ని పనులూ ఉద్యోగులే నిర్వహిస్తుంటారు. ఎంతోమంది రోగులకు సహాయకారిగా ఉంటూ అన్ని విషయాలూ తెలియపరుస్తూ అవగాహన కల్పిస్తారు. సామాన్య ప్రజానీకంతో పనిచేసే కీలకమైన ఉద్యోగులు వీరు. అలాంటి ఉద్యోగులకు సంబంధించిన కనీస సమస్యలను పరిష్కరించడం ప్రభుత్వ బాధ్యతగా చెప్పొచ్చు. ఇప్పటికైనా ప్రభుత్వం ఎన్‌టిఆర్ వైద్యసేవ ఉద్యోగులతో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాల్సి ఉంది.

ఇళ్ల పట్టాల హామీని అమలుచేయాలి : సిపిఎం


భీమవరం : ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్న పేదలకు ఇళ్ల పట్టాలిస్తామని చెప్పిన ప్రభుత్వం హామీని అమలు చేయాలని సిపిఎం భీమవరం పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు డిమాండ్ చేశారు. ఇళ్ల స్థలాల సమస్యపై సోమవారం నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ భీమవరం పట్టణంలో కరపత్రాలు పంపిణీ, గ్రూపు సమావేశాలు నిర్వహించారు. సిపిఎం నాయకులు చెల్లబోయిన వెంకటేశ్వరరావు, తాతారావు పాల్గొన్నారు.

నరసాపురం : ప్రభుత్వ కాలనీలో మంచినీరు, రోడ్లు, డ్రెయినేజీ, విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని మంగళగుంట పాలెంలో ప్రభుత్వం ఇళ్ల స్థలాలకు కేటాయించిన స్థలంలో పది ఎకరాలను పూడిక చేసి 630 గృహాలను నిర్మాణం చేపట్టిందన్నారు. ఈ స్థలాలలో సుమారు 50 కుటుంబాలు గృహాలను పూర్తిస్థాయిలో నిర్మాణ చేసుకుని నివాసం ఉంటున్న విషయం తెలిసిందే. కానీ ఆ కుటుంబాలకు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు మంచిలి నీలకంఠం, నోముల కొండ, బూడిద జోగేశ్వరరావు పాల్గొన్నారు.

తణుకు : ఇరగవరం మండలం రేలంగి గ్రామంలో పేదలకు గత ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఇచ్చిన స్థలాలకు దారి చూపకుండా పట్టాలు ఇచ్చారని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కామన మునిస్వామి అన్నారు. ఆదివారం సిపిఎం ఆధ్వర్యంలో నివాస ప్రాంతాల్లో సమస్యలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులకు ఇచ్చిన పట్టా స్థలాలను పరిశీలించారు. సమస్యలపై ఈనెల 17వ తేదీన కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నా కార్యక్రమంలో కలెక్టర్ వారికి విన్నవించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. సిపిఎం గ్రామ కార్యదర్శి ఇల్లిందరపర్తి సత్యనారాయణ, పప్పుల స్వామి, నీలాపు ఆంజనేయులు, పుణ్యావతుల సత్యనారాయణ, జోగి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆక్వా ఏజెన్సీ ప్రారంభం

వీరవాసరం : నమ్మకమైన వ్యాపారంతో వినియోగదారుల మన్ననలు పొందడం ద్వారా మాత్రమే వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవచ్చని భీమవరం ఎంఎల్ఎ పులపర్తి రామంజనేయులు(అంజిబాబు) అన్నారు. ప్రముఖ ఆక్వా వ్యాపారవేత్త, సామాజిక సేవకుడు మన్నే శ్రీనివాస్‌కు చెందిన విజయలక్ష్మి ఆక్వా ఏజన్సీస్‌ను నవుడూరులో ఆదివారం ఎంఎల్ఎ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ మండలంలో గృహ అవసరాలతో పాటు, ఆక్వా సాగుకు ఇబ్బంది లేకుండా, విద్యుత్ అంతరాయం కలగకుండా నిరంతరం విద్యుత్ సరఫరా ఉండే విధంగా కొత్తలైన్లు ఏర్పాటు పనులు చురుకుగా జరుగుతున్నాయన్నారు. ఇటీవల అసెంబ్లీలో చిన్న, సన్నకారు రైతులతో పాటు ఆక్వా సాగు పై ఆధారపడ్డ అందరు రైతులకు విద్యుత్ రాయితీ వర్తింపు చేయాలని కోరానన్నారు. టిడిపి భీమవరం నియోజవర్గ ఇన్‌ఛార్జి తోట సీతారామలక్ష్మి షాపు యజమాని శ్రీనివాస్‌ను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని చంద్రశేఖర్, దేవి సీఫుడ్స్ జనరల్ మేనేజర్ వి.మోహనకృష్ణ, సామాజిక సేవకుడు మళ్ల రాంబాబు, జనసేన మండల ఉపాధ్యక్షుడు యరకరాజు హరిహరరాజు(హరిబాబు) రాయపల్లి వెంకట్, నాగరాజు శ్రీనివాసరాజు పాల్గొన్నారు.



ఆక్వా ఏజెన్సీస్‌ను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ

విద్యుత్ సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన

ప్రజాశక్తి - భీమవరం టౌన్

శివారు గ్రామాల్లో ఇక విద్యుత్ వోల్టేజ్ సమస్యలు ఉండవని, వాటి పరిష్కారానికే 33/11 కేవీ సబ్ స్టేషన్‌ను ఏర్పాటు చేస్తున్నామని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. ఆదివారం భీమవరం మండలం లోసరి గ్రామంలో రూ.3 కోట్ల 15 లక్షలతో 33/11 కేవీ సబ్ స్టేషన్‌కు ఎంఎల్ఎ అంజిబాబు, రాజ్యసభ మాజీ సభ్యురాలు తోట సీతారామలక్ష్మి భూమిపూజ చేశారు. ఎంఎల్ఎ మాట్లాడుతూ ఈ ఉప కేంద్రంతో బ్రివానిపేట, దొంగపిండి, గరివిడిదిబ్బ, గూట్లపాడు, కొత్త పూసలమర్రు, లోసరి, తోకతిప్ప, నాగేంద్రపురం, నాగిడిపాలెం గ్రామాలు ఎంతో లబ్ది పొందుతాయని అన్నారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు, ఎలక్ట్రికల్ అధికారులు పాల్గొన్నారు.

పరీక్షా కాలం.. ప్రణాళిక ముఖ్యం

నేటి నుంచి 'పది' పరీక్షలు

అభ్యాసంతో పాటు ఆరోగ్యం, నిద్ర అవసరం

పిహెచ్‌సి వైద్యాధికారి సునీల్

ప్రజాశక్తి - కాళ్ల

పదో తరగతి పరీక్షలు ఈనెల 17వ తేదీన ప్రారంభమై 31వ తేదీ వరకు జరగనున్నాయి. మండలంలో తొమ్మిది జెడ్‌పి ఉన్నత పాఠశాలల్లో 600 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారు. సమయం దగ్గర పడుతున్న కొద్దీ కొందరు ఆందోళనకు గురై ఎక్కువ సమయం చదువుకే కేటాయిస్తుంటారు. అధిక మార్కులు సాధించాలంటే అభ్యాసంతో పాటు ఆరోగ్యం, నిద్ర, ఆహారం చాలా అవసరమని నిపుణులు సూచిస్తున్నారు.



సాత్వికాహారం ఎంతో మేలు..

త్వరగా జీర్ణమయ్యే సాత్వికాహారం, అందులోనూ సమతుల పోషక విలువలు ఉండేలా చూసుకోవాలి. మసాలా, జంక్ ఫుడ్స్ జోలికి పోరాదు. కాచి చల్లార్చిన నీటిని, గ్లూకోజ్, బార్లీ, మజ్జిగ, కొబ్బరి నీళ్ల వంటివి తీసుకోవడం మంచిది. శీతల పానీయాలకు దూరంగా ఉండాలి. ఆరోగ్యం, పరిశుభ్రత పట్ల శ్రద్ధ వహిస్తూ రోజుకు అరగంట సమయం యోగా లేదా చిన్నపాటి శారీరక వ్యాయామం చేయాలి.

ఇలా చేద్దాం.. ఒత్తిడిని జయిద్దాం..

ఏకధాటిగా చది వేయకుండా మధ్యలో కొంతసేపు విరామం ఇస్తే చదివినవి గుర్తుంటాయి. ఏకాగ్రత దెబ్బతినకుండా నిర్దేశించుకున్న విధంగా ప్రణాళికాబద్ధంగా పాఠ్యాంశాలు చదవాలి. ప్రతి అంశాన్ని ఆకళింపు చేసుకొని చదివితే గుర్తుంటాయి. చదివిన వాటిని పునశ్చరణ చేసుకుంటే పరీక్షల సమయంలో ఏకాగ్రతతో చక్కగా రాయడానికి అవకాశం ఉంటుంది. అనవసరమైన ఆలోచనలు పెట్టుకోకుండా చరవాణి, టివిలకు దూరంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

చదువుతోపాటు ఆరోగ్యానికి ప్రాధాన్యతివ్వాలి

ఎస్.సునీల్, పిహెచ్‌సి వైద్యాధికారి, కాళ్ల

ప్రతి విద్యార్థి ఒత్తిడికి గురికాకుండా పరీక్ష జరుగు ముందు రోజు రాత్రి త్వరగా నిద్రించినట్లయితే పరీక్ష బాగా రాయగలుగుతారు. పరీక్షల సమయంలో వేడిగా ఉన్న ఆహారాన్ని భుజిస్తూ ఎక్కువగా కాయగూరలు, తాజా పండ్లను తింటే మంచిది. కాచి చల్లార్చిన నీటిని ఒక బాటిల్లో వెంట తీసుకుని వెళ్లాలి. తగినంత సేపు విశ్రాంతి తీసుకుని ఎక్కువసేపు నిద్రించాలి. కనీసం రోజుకు ఎనిమిది గంటలపాటు నిద్ర ఉండేలా చూసుకోవాలి. పరీక్షలు పూర్తి అయ్యే వరకు టివి, మొబైల్ చూడకుండా ఉండాలి. పోషక విలువల గల ఆహారం, పండ్ల రసాలు తీసుకోవాలి. తద్వారా జ్ఞాపకశక్తి పెరుగుతుంది. ఎండల తీవ్రత పెరుగుతున్నందున ఓఆర్ఎస్ ద్రావణం తీసుకోవాలి. తల్లిదండ్రులు కూడా పిల్లల ఆహారం, ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి.

చెరువుల తవ్వకంపై చర్యలు తీసుకోండి

ఎంఎల్ఎ అంజిబాబును కోరిన దిరుసుమర్రు గ్రామస్తులు

భీమవరం టౌన్: శ్మశానవాటికను ఆక్రమణలు చేసి చెరువులు తవ్వేస్తున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని దిరుసుమర్రు గ్రామస్తులు ఎంఎల్ఎ అంజిబాబును కోరారు. శనివారం ఎంఎల్ఎ క్యాంప్ కార్యాలయంలో గ్రామస్తులు ఎంఎల్ఎను కలిశారు. 5 ఎకరాల భూమి, 5 కులాలకు ఉపయోగపడే శ్మశాన వాటికను ఆక్రమించి చెరువులు తవ్వడం సరికాదని, దీనిని నిలుపుదల చేయాలని వారు కోరారు. దీనిపై ఎంఎల్ఎ అంజిబాబు తహశీల్దార్‌తో మాట్లాడి సమస్యను వెంటనే పరిష్కరించాలని తెలిపారు. 50 మంది గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలి

భీమవరం టౌన్ : మనిషి ఆరోగ్యానికి తీవ్ర హానిచేసే ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించడం మన కర్తవ్యమని చైతన్య ఆటో యూనియన్ నాయకులు వీరవల్లి శ్రీనివాస్, పంపిన గోపి, మోగల్లు రమణ అన్నారు. ఆదివారం భీమవరం పురపాలక సంఘం, శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఆర్‌టిసి బస్టాండ్ వద్ద ఆటో యూనియన్ నాయకులతో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహనా ర్యాలీ, ప్రతిజ్ఞ నిర్వహించారు.

IN THE COURT OF THE CHAIRMAN
M.A.C.T. (IST ADDL. DISTRICT JUDGE)
AT: NALGONDA.
M.V. O.P.NO. 95 OF 2021.

Between:
Bathini Sunitha ...Petitioner
AND
Madhura Vinesh Babu and others. ..Respondents

To
Balaji Projects, D.No. 3-2-20/1, Vidyanagar, Tirupathi, West Godawari District, Pin: 534 134, Andhra Pradesh Rep. by Authorized signatory. (Owner of the Maruthi Swift Dizire Car bearing No. KA-41M-8706)
Take notice that the petitioner had filed the above O.P. for grant of compensation on compensation on account of injuries sustained by her in a motor vehicle accident against you and others. The said case is posted to 11-04-2025 for your appearance.
Hence, you are hereby directed to appear in person or through Advocate before the court on **11-04-2025** at **10-30 A.M.,** without fail, failing which the matter will be decided against you as per law.

//BY ORDER OF THE COURT//
REGATTE BHUPAL REDDY
PADAM SEENAIAH
Advocates, Nalgonda.
Mobile No. 9440442482.

Nalgonda.
Dt.13-03-2025.

గ్రామపంచాయతీ కార్యాలయం, నెగ్గిపూడి

ఠి.క.నెం.-/2025 తేది:11-03-2025

టెండరు నోటీసు

పశ్చిమగోదావరి జిల్లా, పెనుమంట్ర మండలం, నెగ్గిపూడి గ్రామ పంచాయతీకి 2025-2026 సం॥రం.నకు ఈ క్రింది తెల్పిన ప్రకారము ది. 01-4-2025వ తేదీ నుండి 31-3-2026వ తేదీ వరకు అనగా ఒక సం.రం.నకు కాల పరిమితి కాంట్రాక్టు పద్ధతి పై సేవలు అందజేయుటకు మరియు ఈ దిగువ అయిటంలకు సంబంధించి సామానులు సరఫరా చేయుటకు నిమిత్తం టెండర్లు కోరబడుచున్నవి. సదరు టెండర్లను ది. 21-03-2025 తేది శుక్రవారం 11.00 గంటల నుండి మధ్యాహ్నం 2.00 గంటల వరకు తీసుకొనబడి అదేరోజు మధ్యాహ్నం 3-00 గంటలకు అప్పటికి హాజరైన టెండరుదార్ల సమక్షంలో టెండర్లు తెరువబడును. అర్హత కలిగిన వ్యక్తులు ఏజన్సీల టెండర్లు నిబంధనలకు అంగీకరించి తమ టెండరు దరఖాస్తులను సమర్పించవలెను. పూర్తి ఇతర వివరములు కొరు వారు గ్రామ పంచాయితీ కార్యాలయము పనిచేయు వేళల యందు అడిగి తెలుసుకొనవచ్చును.

షెడ్యూలు

వ.నెం.	వివరములు	చెల్లించవలసి ధరావతు ఒక్కంటికి
1.	పారిశుద్ధ్య నిర్వహణ - 12 మంది	ఒక్కొక్కరు 50/-లు చొప్పున
2.	మంచినీటి సరఫరా నిర్వహణ -1	రూ. 50/-లు
3.	రక్షిత మంచినీటి సరఫరా పథకం ట్యాంక్ ఆపరేటర్-1	రూ. 50/-లు
4.	వీధి దీపముల రిపేరు పనులు ఎలక్ట్రిషియన్ -1	రూ. 50/-లు
5.	2025-2026 సం॥రం గాను పంచాయితీకి అవసరమైన వీధి దీపములకు ఎల్.ఇ.డి. సెట్స్/ఎల్.ఇ.డి. స్పేర్ పార్ట్స్ తదితర సామానులు సరఫరాచేయుటకు	రూ. 100/-లు
6.	2025-2026 సం॥రం గాను పంచాయితీకి అవసరమైన పారిశుద్ధ్య సామానులు సరపరా చేయుటకు	రూ. 100/-లు
7.	2025-2026 సం॥రం గాను పంచాయితీకి అవసరమైన వీధి వాటర్ వర్క్స్ సామానులు, చేతి పంపుల విడి భాగములు సరపరా చేయుటకు	రూ. 100/-లు
8.	2025-2026 సం॥రం గాను పంచాయితీకి అవసరమైన స్టేషనరీ సామానులు సరపరా చేయుటకు	రూ. 100/-లు
9.	2025-2026 సం॥రం గాను పంచాయితీకి అవసరమైన పారిశుద్ధ్య సిబ్బందికి వాటర్ వర్క్స్ సిబ్బందికి, అటెండర్ బట్టలు, చెప్పులు, జోళ్ళు, కొబ్బరినూనె, సబ్బులు సరపరా చేయుటకు	రూ. 100/-లు

నోట్: పై 5 నుంచి 9 అయిటమ్స్ సప్లయ్ దారులకు గ్రామ పంచాయితీ నిధుల నిల్వలను బట్టి చెల్లింపులు జరుగును.

సం/- **గుత్తికొండ వెంకటేశ్వర్లు**
గ్రామపంచాయితీ కార్యదర్శి, నెగ్గిపూడి

సం/- **మామిడిశెట్టి ధనలక్ష్మి**
సర్పంచ్, గ్రామపంచాయితీ, నెగ్గిపూడి

In The Court Of Additional Civil Judge:(Senior Division) Eluru
E.P.No. 6/2024
O.P.No. 269/2015

Between:
Nerusu Jhansi Lakshmi ...**Decree-Holder**
And
Annamadasu Raghava @ Bujji
And 2 others ...**Judgement-Debtors**

AUCTION PUBLIATION

WHERE AS the DHR obtained decree against the JDRS above named and the property of 1st JDR brought the below mentioned EP schedule property to sale in the above Execution petition.
WHERE AS the Honourable ADDITIONAL CIVIL JUDGE [SEINOR DIVISION] ELURU fixed the date on 09-04-2025 for the sale of the schedule property by public auction in the court, by ordering publication of the sale for notice to the intending bidders in order to participate in the auction.
TAKE NOTICE that the persons who intended to participate in the auction for purchase of the schedule mentioned property can appear before the Honurable court on 09-04-2025 at 10-30 AM on words and participate in auction. The intended bidders are also brought Adhar cards and produce the same at the time of participating the Auction.

SCHEDULE

West Godavari District, [Now called as Eluru District] Eluru Sub-Registry, Tangellamudi Village, sri Pujitha Resident Flat No.303, second floor, an extent of 950 sq. yards flat and 39.4 sq. yards of site in the following boundaries :
East : open to sky
South : open to sky
West : flot No.302
North : open to sky
in the above boundaries, an extent of 950 Sq. yards of site

D.H.R. VALUE: Rs.15,00,000/-
Amine Value Rs.10,00,000/-

D. KRISHNA SASTRY,
Dt. 16..03..2025. Advocates for DHR.
Eluru Eluru.

పొట్టి శ్రీరాముల త్యాగం చిరస్మరణీయం

ఘనంగా పలుచోట్ల జయంతి కార్యక్రమాలు

భీమవరం టౌన్ : అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయమని, మహోన్నత వ్యక్తి పొట్టి శ్రీరాములని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. మావుళ్లమ్మ దేవస్థానం వద్ద ఎంఎల్ఎ పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్యవైశ్య యువజన సంఘం, వర్తక సంఘం, మండలి సంఘం సభ్యులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నరసాపురం : నరసాపురం వాసవి క్లబ్ ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్టీమర్ రోడ్‌లో జోన్ ఛైర్మన్ అప్పన బదరీ, మెయిన్ రోడ్డులో మాజీ జోన్ ఛైర్మన్ దేవత సుబ్బారావు చలివేంద్రాలు ప్రారంభించారు. ప్రెసిడెంట్ నూలి శ్రీనివాస్, సెక్రటరీ కె.బాబ్జీ, ట్రెజరర్ కె.బాలకృష్ణ, జోన్ ఛైర్మన్ బదరీ, మెంబర్స్ పాల్గొన్నారు.

గణపవరం : ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు నారాయణ సురేష్ స్థానిక మార్కెట్ వద్దనున్న శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు నడంపల్లి రాంపండు, చవ్వా రవి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

